అభిజిత్ మూత


అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ ముందు బైఠాయించి ఆందోళన చేస్తున్న కార్మికులు

ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలో తాత్కాలికంగా ఉత్పత్తి నిలిపివేత

- ఆర్థిక సంక్షోభమే కారణమంటున్న యాజమాన్యం
- రోడ్డున పడ్డ కార్మికులు
- కంపెనీ ముందు ఆందోళన

అచ్యుతాపురం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రత్యేక ఆర్థిక మండలిలో అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీని యాజమాన్యం తాత్కాలికంగా మూసివేసింది. సోమవారం ఉదయం విధులకు హాజరుకావడానికి వచ్చిన కార్మికులు.. ప్రధాన ద్వారం తెరవకపోవడం, కంపెనీని తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు గేటుకు అంటించిన నోటీసులు కనిపించడంతో ఆందోళన చెందారు. ముందస్తు నోటీసులు జారీ చేయకుండా కంపెనీ మూసివేయడంతో తాము రోడ్డున పడ్డామని కార్మికులు లబోదిబోమంటున్నారు.

అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలో సుమారు మూడు వేల మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. ఎనిమిది బ్లాస్ట్ ఫర్నేస్‌లతో రోజువారీ 800 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫెర్రో కంపెనీలకు ఎటువంటి రాయితీలు, విద్యుత్ మినహాయింపులు ఇవ్వకపోవడంతో కంపెనీ తీవ్ర సంక్షోభంలో పడినట్టు ఉద్యోగులు చెబుతున్నారు. గతంలో విద్యుత్ యూనిట్ ధర రూ.4.25 వుండగా, వైసీపీ ప్రభుత్వం రూ.6.05కు పెంచింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ఫెర్రో ఉత్పత్తులు టన్ను రూ.1.55 లక్షల నుంచి రూ.70 వేలకు పడిపోవడంతో కంపెనీని నడపలేని పరిస్థితి ఏర్పడిందని యాజమాన్య ప్రతినిధులు చెబుతున్నారు. దీంతో సోమవారం నుంచి కంపెనీని తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు ప్రకటించారు. ఈ విషయం సోమవారం ఉదయం విధులకు హాజరయ్యే వరకు కార్మికులకు తెలియదు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ఎటువంటి సమాచారం లేకుండా కంపెనీని మూసివేస్తే తామంతా రోడ్డున పడతామని కార్మికులు వాపోయారు. యాజమాన్యం తీరును సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము తప్పుబట్టారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ కార్మికులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సిండికేట్లదే హవా!

మద్యం షాపులు దక్కించుకునేందుకు కుటుంబ సభ్యులు, అనుచరుల పేర్లతో భారీగా దరఖాస్తులు

- లాటరీ ద్వారా కేటాయించిన అధికారులు
- అయినా మద్యం వ్యాపారుల చేతికే మెజారిటీ షాపులు

అనకాపల్లి/ టౌన్ / కొత్తూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)
జిల్లాలో మద్యం షాపుల లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. గతంలో మద్యం వ్యాపారంలో అనుభవం ఉన్న కొంతమంది కనుసన్నల్లోనే మొత్తం వ్యవహారం సాగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం షాపులను పారదర్శకంగా లాటరీ పద్ధతిలో కేటాయించాలని ప్రభుత్వం భావించినప్పటికీ కొందరు సిండికేట్‌లుగా ఏర్పడి, బినామీలతో భారీగా దరఖాస్తులు చేయించారు. దీంతో అత్యధిక మద్యం దుకాణాలను సొంతం చేసుకున్నట్టు తెలిసింది.


మద్యం షాపుల లాటరీ కార్యక్రమానికి హాజరైన మహిళలు


లాటరీ తీస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

జిల్లాలో 136 మద్యం షాపుల కేటాయింపు కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరించగా మొత్తం 3,291 దరఖాస్తులు అందాయి. ప్రతి దరఖాస్తుదారుడి నుంచి రూ.2 లక్షలు వంతున (తిరిగి చెల్లించని) డిపాజిట్ సేకరణ ద్వారా ప్రభుత్వానికి రూ.65.82 కోట్లు ఆదాయం వచ్చింది. కాగా కలెక్టర్ విజయకృషన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారులు నూకాంబిక అమ్మవారి దేవస్థానం సమీపంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ ద్వారా షాపులను కేటాయించారు. కలెక్టర్ స్వయంగా లాటరీ తీసి ఏ షాపు ఎవరికి వచ్చిందో ప్రకటించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు షాపుల కేటాయింపు లాటరీ ప్రక్రియ ముగిసింది. లాటరీ ద్వారా దుకాణాలను కేటాయించడానికి తొలుత ప్రతి షాపునకు సంబంధించి దరఖాస్తుదారులకు టోకెన్ నంబర్లు ఇచ్చారు. అనంతరం దుకాణాల వారీగా దరఖాస్తుదారుల నుంచి టోకెన్లు తీసుకుని ఒక స్టీలు బాక్స్‌లో వేసి లాటరీ తీశారు. ఇందులో వచ్చిన నంబరు, దరఖాస్తుదారుని పేరును వెల్లడించారు. ప్రతి షాపునకు ముగ్గురిని ఎంపిక చేశారు. లాటరీలో తొలుత షాపు దక్కించుకున్న వ్యక్తి ఎటువంటి కారణాలతోనైనా తప్పుకొంటే తరువాత వ్యక్తికి ప్రాధాన్యం ఇచ్చేవిధంగా ముందుగానే రిజర్వుడ్-1, రిజర్వుడ్-2తో మరో రెండు పేర్లను ఎంపిక చేశారు. తొలుత ఎంపికైన వ్యక్తి షాపు తీసుకోకపోతే రెండో వ్యక్తికి, లేదా మూడో వ్యక్తికి షాపు కేటాయిస్తారు.

మద్యం సిండికేట్లు

మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు రాజకీయ పార్టీల నేతలు తెరవెనుక వుండి చక్రం తిప్పారు. వారు స్వయంగా దరఖాస్తు చేయకుండా తమ కుటుంబ సభ్యులు, అనుచరుల పేర్లతో భారీగా దరఖాస్తు చేయించారు. అనకాపల్లికి చెందిన ఒక ప్రజాప్రతినిధి అల్లుడు వందకుపైగా దరఖాస్తులు పెట్టించి ఎనిమిది షాపులను లాటరీలో దక్కించుకున్నట్టు తెలిసింది. ఎలమంచిలి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు వైసీపీ నాయకులు వందకుపైగా షాపులకు దరఖాస్తులు చేసుకోగా ఎనిమిది షాపులు దక్కినట్టు సమాచారం. అనకాపల్లికి చెందిన ఒక ప్రముఖ మద్యం వ్యాపారి కుటుంబ సభ్యులు 91 షాపులకు దరఖాస్తు చేయగా, అధికారులు తీసిన లాటరీలో మూడు షాపులు మాత్రమే దక్కాయి. మాకవరపాలెం, గొలుగొండ, కోటవురట్ల మండలాల్లో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు సిండికేట్‌గా ఏర్పడి కొన్ని మద్యం దుకాణాలను చేజిక్కించుకున్నారు. చోడవరం నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఒకరు చాలా కాలంగా మద్యం వ్యాపారంలో వున్నారు. ఇతనితోపాటు అనుచరులు కలిసి 110 దుకాణాలకు దరఖాస్తు చేయగా, లాటరీలో పది దుకాణాలు దక్కినట్టు చెబుతున్నారు. ఇక 120 మందికిపైగా మహిళలు మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకోగా లాటరీలో 25 మందికి షాపులు దక్కాయి. కాగా మద్యం షాపుల కేటాయింపునకు లాటరీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారి సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు.


పల్లె పండుగలో మోక్షం కలగనున్న చోడవరం- పీఎస్‌పేట రోడ్డు

పల్లెకు అభివృద్ధి పండుగ

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

- ఉపాధి పథకం నిధులతో రోడ్లు, తాగునీరు, ఇతర పనులు
- పల్లె పండుగ పేరుతో వారోత్సవాలు
- జనవరి చివరినాటికి పనులు పూర్తి చేయాలని ప్రణాళిక
- నాణ్యతకు ప్రాధాన్యం.. సామాజిక తనిఖీ, క్వాలిటీ కంట్రోల్ పర్యవేక్షణ

అనకాపల్లి/ చోడవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):
కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047 సాకారం కోసం వేగంగా అడుగులు వేస్తోంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పల్లెల్లో పడకేసిన అభివృద్ధిని పట్టాలెక్కించేందుకు 'పల్లె పండగ' పేరిట ప్రతి పంచాయతీలో వారోత్సవాలను నిర్వహిస్తున్నది. సోమవారం ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ నెల 20వ తేదీ వరకు జరగనున్నది. ఈ సందర్భంగా పల్లెలో సామాజిక అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తారు.

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని గాలికొదిలేసింది. రహదారులు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, నిర్వహణను పట్టించుకోలేదు. గ్రామ పంచాయతీలకు కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించింది. గ్రామాలకు కేటాయించాల్సిన నిధులను సంక్షేమ పథకాల పేరుతో దారి మళ్లించి గ్రామ పరిపాలనా వ్యవస్థను నిర్వీర్యం చేసింది. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద ఇచ్చే నిధులను సైతం వేరే వాటికి మళ్లించింది. ఐదేళ్ల కాలంలో గ్రామాల్లో ఒక్క సిమెంట్ రోడ్డు వేయలేదు.. డ్రైనేజీ కాలువ నిర్మించలేదు. నిధుల లేమితో పంచాయతీలు నిర్వీర్యం అయ్యాయి. ప్రధానంగా రహదారులు, మురుగు కాలువల నిర్వహణ పూర్తిగా పడకేశాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ... మిగతా 8వ పేజీలో

ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ టీచర్ల కొరత

51 హైస్కూళ్లలో ఒక్కరు కూడా లేని దుస్థితి

- విద్యా సంవత్సంలో ఇప్పటికే నాలుగు నెలలు పూర్తి
- హిందీ బోధకులు లేక విద్యార్థుల ఇబ్బందులు

నర్సీపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో హిందీ ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వుంది. ఉంది. పలు పాఠశాలల్లో హిందీ బోధించకుండానే విద్యా సంవత్సరంలో నాలుగు నెలలు గడిచిపోయాయి. విద్యార్థులు ఎక్కువ ఉన్న పాఠశాలల్లో ఇద్దరు హిందీ పండిట్‌లు అవసరంకాగా ఒక్కరే పని చేస్తున్నారు.

జిల్లాలో 226 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆరు నుంచి పదో తరగతి వరకు 72,051 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో పదో తరగతి విద్యార్థులు 15,387 ఉన్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు సెకండ్ లాంగ్వేజ్‌గా ఎక్కువ మంది హిందీ తీసుకుంటున్నారు. దీంతో ప్రతి పాఠశాలలో హిందీ పండిట్ వుండాలి. విద్యార్థులు ఎక్కువ మంది ఉన్న పాఠశాలల్లో రెండు హిందీ పండిట్ పోస్టులు వుంటాయి. కాగా జిల్లాలో 51 ఉన్నత పాఠశాలల్లో హిందీ ఉపాధ్యాయులు లేరు. మరో ఐదు నెలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. 51 పాఠశాలల్లో ఇప్పటి వరకు హిందీ పాఠాలు బోధించలేదు. కొన్ని పాఠశాలల్లో ఇతర టీచర్లతో హిందీ పాఠాలు చెప్పిస్తున్నారు. కానీ పెద్దగా ఫలితం ఉండడం లేదు. ఇటీవల ఉపాధ్యాయుల సర్దుబాటు సమయంలో యూపీ స్కూళ్లలో పని చేస్తున్న కొంతమంది హిందీ టీచర్లను హైస్కూళ్లకు పంపారు. అయినప్పటికీ ఇంకా 51 పాఠశాలల్లో హిందీ ఉపాధ్యాయులు లేని పరిస్థితి నెలకొంది. డీఎస్సీ నిర్వహించేర వరకు హిందీ ఉపాధ్యాయుల కొరత తీరే పరిస్థితి లేదు. జిల్లా విద్యా శాఖ అధికారులు స్పందించి అవసరం లేని చోట ఇద్దరేసి టీచర్లు ఉన్న పాఠశాలల నుంచి ఒక హిందీ టీచర్‌ను కొరత వున్న పాఠశాలలకు డిప్యూటేషన్ మీద పంపించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు.

పేరుకే పెద్దాస్పత్రి



రోగులకు సక్రమంగా అందని వైద్య సేవలు

- ఓపీ సేవలకు పలు విభాగాల్లో ప్రొఫెసర్లు దూరం
- అసోసియేషన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జూనియర్ వైద్యులపై వదిలేస్తున్న వైనం
- ఓపీ చీటీ తీసుకోవడం నుంచే సమస్యలు మొదలు...
- స్మార్ట్ ఫోన్ లేకుంటే నానాతిప్పలు
- ఏవైనా పరీక్షలు అవసరమైతే రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి
- మందులు కొరత తీవ్రం...ఒకటో, రెండో రకాలు బయట కొనుక్కోవాల్సిన దుస్థితి

ఆంధ్రజ్యోతి విజిట్

విశాఖపట్నం/ మహరాణిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):
ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రి కేజీహెచ్. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచే కాకుండా విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాలతోపాటు పక్కనున్న ఒడిశా, చత్తీసగఢ్ రాష్ట్రాల నుంచి ప్రతిరోజూ వందలాది మంది నిరుపేదలు వైద్యం కోసం ఇక్కడకు వస్తుంటారు. అయితే వారికి సకాలంలో సేవలు అందడం లేదని, సీనియర్ డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదని 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలనలో తేలింది. ఇంకా ఎక్స్‌రే, ఎంఆర్‌ఐ వంటి పరీక్షల కోసం రోగులు రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. మందులు కూడా అన్నీ ఇవ్వడం లేదు. బయట కొనుక్కోవాల్సిందిగా చెబుతున్నారు. ఆస్పత్రిలో పరిస్థితులను తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు సోమవారం కేజీహెచ్‌ను సందర్శించారు. ఓపీ కౌంటర్‌తోపాటు ఓపీ విభాగాలు, మందులు ఇచ్చే కౌంటర్లు, రక్త పరీక్షా కేంద్రాన్ని సందర్శించి వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు యత్నించారు.

డిజిటలీకరణతో ఇబ్బందులు

కేజీహెచ్‌లో సాధారణ వైద్య సేవలు పొందాలంటే తప్పనిసరిగా ఓపీ (అవుట్‌పేషెంట్ చీటీ) తీసుకోవాలి. ఇందుకోసం రెండు చోట్ల కౌంటర్లు ఉన్నాయి. అయితే, ఓపీని కూడా డిజిటలైజ్ చేశారు. ఓపీ తీసుకోవాలంటే అభా పేరుతో ఉన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఆలస్యం అవుతోంది. ఓపీ కోసం చాలాసేపు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. రోగులకు సహకారాన్ని అందించేందుకు సిబ్బందిని నియమించినా పాట్లు తప్పడం లేదు. స్మార్ట్ ఫోన్ లేనివారు వస్తే ఇక చెప్పాల్సిన అవసరం లేదు. ఆస్పత్రికి వచ్చే రోగులకు తొలి ఇబ్బంది ఇక్కడ నుంచే మొదలవుతోందని చెప్పవచ్చు.

సీనియర్ వైద్యులు డుమ్మా..

ఓపీ తీసుకుని ఆయా విభాగాలకు కేటాయించిన రూమ్‌లకు వెళ్లి వైద్యులకు చూపించాల్సి ఉంటుంది. సాధారణంగా ఓపీ సేవల్లో ఆయా యూనిట్లకు చెందిన ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లుతోపాటు జూనియర్ వైద్యులు, పీజీలు సేవలు అందించాల్సి ఉంటుంది. సోమవారం చర్మ వ్యాధులు, గైనిక్, కార్డియాలజీ, ఆర్థో, జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్ విభాగాల్లో ఓపీ సేవలు అందించారు. గైనిక్ విభాగంలో ఓపీ సేవలకు ప్రొఫెసర్ దూరంగా ఉన్నారు. ఇక్కడ అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌తోపాటు జూనియర్ వైద్యులు ఉన్నారు. జనరల్ మెడిసిన్ విభాగం ఓపీలో ప్రొఫెసర్‌తోపాటు ఇతర వైద్యులు ఉన్నారు. అయితే 11.30 గంటల సమయంలో ప్రొఫెసర్ వెళ్లిపోవడం కనిపించింది. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం ఓపీలో ప్రొఫెసర్ అందుబాటులో లేరు. మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయన రాకపోవడంతో ఆ విభాగానికి చెందిన ఇతర వైద్యులు, జూనియర్ డాక్టర్లే ఓపీ సేవలను నిర్వహించారు. ఆర్థో విభాగం ఓపీలోనూ ప్రొఫెసర్ కనిపించలేదు. రోగులకు అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్‌తోపాటు జూనియర్ వైద్యులు సేవలు అందించారు.

మందులకు తప్పని ఇబ్బందులు

కేజీహెచ్‌లో రోగులు ఎదుర్కొనే మరో ప్రధాన సమస్య మందుల కొరత. ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు రాసే మందుల్లో ఏదో ఒకటి గానీ అంతకుమించి గానీ అక్కడ ఉండవు. కొన్ని మందులను బయటే కొనుగోలు చేయాలని ప్రతి ఒక్కరికీ చెబుతుంటారు. మందులు తీసుకుని బయటకు వచ్చిన కొందరు రోగులతో మాట్లాడగా గ్యాస్ట్రిక్, కార్డియాలజీ, థైరాయిడ్‌కు సంబంధించిన మందులతోపాటు పెయిన్ కిల్లర్స్ మందులు లేవని చెప్పినట్టు వెల్లడించారు. వీటితోపాటు కొన్ని దీర్ఘకాలిక వ్యాధులకు అందించే ఖరీదైన ఇంజెక్షన్లు కూడా అందుబాటులో లేకపోవడంతో చాలామంది ... మిగతా 8వ పేజీలో

నరక ప్రయాణం

- అనకాపల్లి- చోడవరం రోడ్డులో అడుగడుగునా గోతులు
- వాహనదారులు, ప్రయాణికుల ఇక్కట్లు


బవులవాడ వద్ద గోతులమయంగా మారిన రహదారి


దర్జీనగర్ వద్ద రోడ్డుపై భారీ గొయ్యి

తుమ్మపాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి - చోడవరం రోడ్డు దారుణంగా తయారైంది. అడుగడుగునా భారీ గోతులు ఏర్పడటంతోపాటు తారు లేయరు లేచిపోవడంతో భయానకంగా మారింది. ఇటీవల రూ.30 లక్షలతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినప్పటికీ కురుస్తున్న వర్షాలకు పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. అనకాపల్లి-చోడవరం రోడ్డును ఆనుకుని తుమ్మపాల, మార్టూరు, దిబ్బపాలెం, ఊడేరు, బవులవాడ, మామిడిపాలెం గ్రామాలు ఉన్నాయి. అలాగే పాపయ్యపాలెం, సంతపాలెం, వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, మెట్టపాలెం తదితర గ్రామాల ప్రజలు అనకాపల్లి పట్టణానికి రాకపోకలు సాగించాలంటే ఈ రోడ్డే దిక్కు. అనకాపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పడడంతో చోడవరం, కె.కోటపాడు, దేవరాపల్లి, మాడుగుల, చీడికాడ మండలాల నుంచి ప్రజలు వివిధ పనుల మీద రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా వుండే ఈ రోడ్డు నిర్వహణకు గత ప్రభుత్వం ఒక్కసారి కూడా నిధులు మంజూరు చేయలేదు. ఫలితంగా గోతులు ఏర్పడి ఛిద్రమైంది. ముఖ్యంగా తుమ్మపాల నుంచి మామిడిపాలెం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు.


తుమ్మపాల వద్ద ఛిద్రమైన రోడ్డు

వరికి పొటాషియం లోపం

» నీటిలో మునగడంతోనే తెగులు



పొటాషియం లోపంతో ఉన్న వరి పొలం

ఎస్. రాయవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన అధిక వర్షాలకు నీట మునిగిన వరి పొలాలకు పొటాషియం లోపం వెంటాడుతోంది. తక్షణమే రైతులంతా ఎరువులు, మందులను వేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఏవో సౌజన్య సూచించారు. అంతేకాకుండా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వలన వరి పొలాల్లో అగ్గి తెగులు, పాము పొడ తెగులు, సుడిదోమ వంటివి అధిక నష్టాన్ని కలిగించే అవకాశం ఉందన్నారు. వరి పైరులో పొటాషియం లోపాన్ని నివారించేందుకు మల్టీ కే మందును లీటరు నీటిలో ఐదు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే జీవన ఎరువైన కేఆర్‌బీను కూడా పశువుల గెత్తంతో కలిపి ఆ పొలంలో చల్లుకోవాలన్నారు. అలా చేసిన మూడు రోజుల తరువాత వరి పైరుకు పొటాషియం లోపం తొలగిపోతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి పొలంలో అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. దాని నివారణకు ట్రైసైక్లజోల్ మందును లీటరు నీటికి 0.6 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. పాము పొడ తెగులు, సుడిదోమ కూడా వరికి అధిక నష్టాన్ని కలిగిస్తాయన్నారు. ఒకవేళ తెగులు, పురుగు ఉన్నట్టు గమనించినట్టయితే వాటి నివారణకు హెక్సాకొనజోల్ మందు రెండు మిల్లీలీటర్లు, ఎసిఫేట్ మందు 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి వరి పొలం దుబ్బు తడిచేలా పిచికారీ చేసుకోవాలన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



హరిపాలెం పీహెచ్‌సీకి వచ్చిన కేంద్ర బృందం

అచ్యుతాపురం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీలో సోమవారం కేంద్ర బృందం పర్యటించింది. సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై అవగాహనలో భాగంగా ఏపీహెచ్‌ఎస్‌ఎస్‌పీ (ఢిల్లీ) ఐపీఏ ఆడిట్ టీమ్ సభ్యురాలు జైత్ర నేతృత్వంలో పీహెచ్‌సీల పనితీరు, రోగులకు అందుతున్న వైద్యంపై ఆమె ఆరా తీశారు. రోగుల వార్డులు, మందుల గదులను సందర్శించి, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. దుప్పితూరు, చీమలాపల్లి గ్రామాల్లో గల హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లను సందర్శించిన ఆమె రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారిణి జయ ప్రశాంతి, వైద్యాధికారులు డాక్టర్ సుగుణ, డాక్టర్ కె.శ్రావ్య, సిబ్బంది వేణుగోపాల్, రమణబాబు, అప్పలకొండ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

70వ సారి రక్తదానం చేసిన చందు

అచ్యుతాపురం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మెగా అభిమాని, జనసేన నాయకుడు లాలం చందు 70వ సారి రక్తదానం చేశాడు. తమ అభిమాన హీరో మెగా మేనల్లుడు సాయిధరమ్ తేజ్ జన్మదినం పురస్కరించుకుని చేస్తున్న వారోత్సవాలలో భాగంగా హైదరాబాదులోని జూబ్లీహిల్స్‌లో గల చిరంజీవి బ్లడ్‌బ్యాంకులో 70వ సారి రక్తదానం చేసి తన అభిమానాన్ని చాటుకున్నాడు. కార్యక్రమంలో ఆల్‌ఇండియా చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు రవణం స్వామి నాయుడు, చిరంజీవి పర్సనల్ మేనేజరు ఎన్ఎస్ గంగాధర్ సమక్షంలో రక్తదానం చేశారు.



రక్తదానం చేస్తున్న లాలం చందు

ముగిసిన భవానీ దీక్షలు



పూజలు చేస్తున్న భవానీ భక్తులు

నక్కపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జై భవానీ దుర్గా భవానీ, మండల, అర్ధ మండల, నవరాత్రి దీక్షలు సోమవారంతో ముగిశాయి. ఇందుకు సంబంధించి స్థానిక గురుస్వామి దవరసింగి రాంబాబు మాట్లాడుతూ గడచిన మూడు రోజులుగా దీక్షా విరమణలకు అనేక మంది భవానీలు తరలివెళ్లారన్నారు. దీక్ష పూర్తిచేసుకున్నవారంతా అమ్మవారి ఇరుముడులు గురు భవానీల సమక్షంలో ధరించి, ఇంద్రకీలాద్రి జగన్మాత దర్శనానికి వెళ్లి దీక్ష విరమించారన్నారు. సోమవారం నాటితో దీక్షలు ముగిశాయన్నారు. నవంబరు నెల రెండోవారం నుంచి అమ్మవారి చండీ దీక్షలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

నేవీ రోడ్డులోని గుంతలను పూడ్చాలని సీపీఎం ఆందోళన

రాంబిల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి నేవీ రోడ్డులోని గుంతలను పూడ్చి వేయించాలని సీపీఎం ఆధ్వర్యంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, మండల కో-కన్వీనర్ జి.దేముడునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన సీపీఎం నేతలు, కార్మిక సంఘాల నేతలతో కలిసి వెంకటాపురం జంక్షన్ నుంచి వాడనర్సాపురం నేవీ గేటు వరకు గోతులను పరిశీలించారు. అనంతరం రాంబిల్లిలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ.. నేవీ రోడ్డులో అడుగడుగునా పెద్ద గొయ్యిలు ఏర్పడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ గొయ్యిలు వర్షం నీటితో నిండిపోవడంతో రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రమాదలకు గురవుతున్నారన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు గోతులను పూడ్చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు రాంబాబు, వై.రాము, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రాంబిల్లి జంక్షన్ వద్ద నిరసన చేస్తున్న సీపీఎం నేతలు

ఎలమంచిలిలో రాజ్యమేలుతున్న సమస్యలు

» విలీన వార్డుల్లో పదేళ్లుగా పరిష్కారానికి నోచుకోని వైనం
» రోడ్లు, డ్రైనేజీలు లేక ఇక్కట్లు
» ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టని పాలకులు, అధికారులు

ఎలమంచిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపాలిటీలో సమస్యలు తాండవిస్తున్నాయి. మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ అయి పదేళ్ల కావస్తున్నా విలీన వార్డుల్లో నేటికీ సమస్యలు రాజ్యమేలుతున్నాయి. సమస్యలున్నప్పటికీ వాటిని పరిష్కరించేందుకు పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పట్టణవాసులు విమర్శిస్తున్నారు.

ఎలమంచిలి మునిసిపాలిటీ పదేళ్ల క్రితం ఏర్పడింది. ఈ సమయంలో పక్కనున్న పంచాయతీలను కూడా మునిసిపాలిటీలో విలీనం చేసి, 50 వేల పైబడి జనాభాతో 25 వార్డులను ఏర్పాటు చేశారు. ఈ వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం, సామాజిక సమస్యలు ఏళ్ల తరబడి పేరుకుపోయాయి. పాలకులు, అధికారులు సమస్యలు పరిష్కరించడం లేదని పట్టణవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మునిసిపాలిటీలో ప్రత్యేకతను సంతరించుకున్న సోమలింగపాలెం, పెదపల్లి, ధర్మవరం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం విలీన వార్డుల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. సోమలింగపాలెం వార్డు ప్రధాన రోడ్డుపైనే వాడుక నీరు ప్రవహిస్తోంది. గతంలో ఈ రోడ్డు సగ భాగం ఆధునీకరించి, సగం విడిచిపెట్టడంతో వాడుక నీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తున్నది. ఏళ్ల గడుస్తున్నా సరే ఈ సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. అదేవిధంగా కట్టుపాలెంలో ఇళ్ల ముందు రోడ్డుపై నెలలు తరబడి మురుగు నీరు నిలిచిపోయి ఉంటుంది. దీంతో స్థానికులు మురుగునీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ సమస్యను మునిసిపల్ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పరిష్కారానికి నోచుకోలేదు. అదేవిధంగా రామారాయుడుపాలెం వార్డుకు వెళ్లే ప్రధాన రోడ్డు గత తుఫాన్‌కు దెబ్బతింది. ఇటీవల తుఫానుకు మరోసారి ఈ రోడ్డులో కల్వర్టు దెబ్బతినడంతో గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైంది. అదేవిధంగా పెదపల్లి, ధర్మవరం వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించకపోవడం, పూర్తి స్థాయిలో రోడ్లు నిర్మించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విలీన వార్డుల్లో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ఎమ్మెల్యే, మునిసిపల్ పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.



సోమలింగపాలెం ప్రధాన రోడ్డుపై పారుతున్న వాడుక నీరు



కట్టుపాలెంలో ఇళ్ల ముందు రోడ్డుపై నెలలు తరబడి నిలిచిన మురుగు

గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

» ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ » గ్రామాల్లో ఉత్సాహంగా పల్లె పండుగ



ఎలమంచిలి: పేట బయ్యవరంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



పాయకరావుపేట రూరల్: నామవరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఎలమంచిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో తీసుకువెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం ఏటికొప్పాక గ్రామం నుంచి పల్లె పండుగ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఏటికొప్పాక, పేట బయ్యవరం, ములకలాపల్లి, లక్కవరం, రుక్మిణీపురం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీఎస్‌ఆర్‌పేటలో మహిళలు మాట్లాడుతూ తాగునీటి బోరు మరమ్మతుకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని, డ్రైనేజీల నుంచి దుర్వాసన వెదజల్లుతుందని ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పేట బయ్యవరంలో ఎమ్మెల్యే సుందరపును మాజీ వైస్‌ఎంపీపీ గొన్నాబత్తుల శేషు, మాజీ సర్పంచ్ గెంజి శ్రీను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కొండలరావు, పీఆర్ డీఈఈ మునిశేఖర్, ఏటికొప్పాక సర్పంచ్ భజంత్రీల లక్ష్మి, కూటమి నేతలు రాజాన శేషు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, అన్నం బాబ్జీ, రాజాన వెంకునాయుడు, ఇత్తంశెట్టి రాజు, లవుడు లోవరాజు, నాని, తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమంలో నామవరంలో రూ.5 లక్షలతో డ్రైనేజీలు, కల్వర్టులు, సీతారాంపురంలో రూ.10 లక్షలతో రోడ్లు, డ్రైనేజీలు మంగవరంలో రూ.15లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు శంకుస్థాపన చేశారు. గ్రామ సభలలో తీర్మానం చేసిన మేరకు ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో హేమలత, పంచాయతీరాజ్ ఏఈ కచేరి, పంచాయతీ కార్యదర్శులు వైవీ.సత్యనారాయణ, మల్లికార్జునాచారి, సర్పంచ్ పి.వెంకటకృష్ణ, టీడీపీ నాయకులు కురందాసు శివ, గొర్ల లక్ష్మీనారాయణ, దేవవరపు గోవిందు, జనసేన నాయకులు కట్టా దొర, శ్రీను, నర్సయ్య, వైసీపీ నాయకులు యినరపు తాతారావు, వంగలపూడి రామారావు, గూటూరు రామగోవిందు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మండలంలో తంగేడు, కైలాసపట్నం, కోటవురట్ల పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కోటవురట్లలో ఎంపీడీవో కాశీవిశ్వనాథం, తహసీల్దార్ తిరుమలరావు ఆధ్వర్యంలో పాతసంతబయిల వద్ద అంకంరెడ్డివారి వీధిలో రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కైలాసపట్నం గ్రామంలో రెండు సిమెంట్ రోడ్లకు రూ. 2.6లక్షలు, తంగేడులో పంచాయతీలో ఒక సిమెంట్ రోడ్డు రూ 6.4 లక్షలు మంజూరైనట్టు మండల ఇంజనీర్ వర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల జానకి శ్రీనివాసరావు, కోటవురట్ల సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు పి. సూర్యరావు, తంగేడు సర్పంచ్ కోరుప్రోలు శివ పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

మండలంలోని వైలోవ, పెదకలవలాపల్లి గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎస్.జయమాధవి మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల్లో రూ.28 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాజు, ఉపాధి థకం, వెలుగు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, ఆయా గ్రామాల సర్పంచులు వై. కనకారావు, నారాయణరావు, పెదకలవలాపల్లి మాజీ సర్పంచ్ కె.ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.



కోటవురట్లలో సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేసిన టీడీపీ నేత జానకి శ్రీనివాసరావు



రాంబిల్లి: పెదవలాపల్లిలో సీసీ రోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

వాహనదారులు నిబంధనలను పాటించాలి : ఎస్ఐ

ఎలమంచిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని పట్టణ ఎస్ఐ సావిత్రి అన్నారు. సోమవారం ఎలమంచిలి సమీపంలో వాహనాలను ఆమె తనిఖీ చేశారు. మైనర్లు వాహనాలు నడిపితే నిబంధనలు ప్రకారం చర్యలు తప్పవన్నారు. హెల్మెట్ ఉపయోగించడంతో ఎంతో రక్షణగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రికార్డులు లేని వారిపై కేసులు నమోదు చేశారు.



ఎలమంచిలి సమీపంలో వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న పట్టణ ఎస్ఐ సావిత్రి

ప్రేరణ ఉత్సవ్‌లో పాల్గొన్న విద్యార్థినికి అభినందనలు

ఎలమంచిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ ప్రేరణ ఉత్సవ్‌లో పాల్గొన్న తులసీనగర్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని డి. వైష్ణవిని సోమవారం స్కూల్ హెచ్ఎం హిమబిందు, టీచర్లు అభినందించారు. వికసిత భారత్-2047ను లక్ష్యంగా చేసుకుని దేశ చరిత్ర, నాగరికత, సాహసం, క్రమశిక్షణ, ఆవిష్కరణ తదితర ఎన్నో విషయాలతోపాటు జీవితాన్ని మలుపు తిప్పే విద్యను గురించి వివరించినట్టు విద్యార్థిని వైష్ణవి తెలిపింది.



విద్యార్థిని వైష్ణవిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు ఉంచాలి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయ జంక్షన్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గల తెలుగు విశ్వ విద్యాలయాలకు ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ గత నెల 20వ తేదీన తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశం నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్ 1985లో ఉభయ రాష్ట్రాల హైదరాబాద్, రాజమండ్రి, శ్రీశైలం, కూచిపూడి ప్రాంతాల్లో ఉన్న తెలుగు విశ్వ విద్యాలయాలను నెలకొల్పి వాటికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆ పేరును తొలగించేందుకు నిర్ణయించడం సరికాదన్నారు. అమరజీవి పేరును కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, మల్లేశ్వరరావు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో నైపుణ్యాలు మెరుగు

పాయకరావుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వృత్తి విద్యా కోర్సులతో విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగుపర్చుకోవచ్చని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.జాన్‌ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెల్త్, ఆటోమోటివ్ ట్రేడ్లు చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్స్ కోసం సోమవారం పట్టణంలో పీహెచ్‌సీతోపాటు ఆటోమోటివ్ షోరూమ్‌లలో వృత్తి విద్యా కోర్సుల కో-ఆర్డినేటర్ ఎస్.రమేష్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శిక్షకులు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సీయూకే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా రమేష్



కోటవురట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ (సీయూకే) మానసిక శాస్త్ర విభాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కోటవురట్ల మండలం రామచంద్రపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ రమేష్‌బాబు తమరాన నియమితులయ్యారు. డాక్టర్ రమేష్ సోమవారం విధుల్లో చేరారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల బుద్ధి వికాసానికి, యూనివర్శిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

రాంబిల్లిలో పోస్టల్ పథకాలపై కళాజాత

రాంబిల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోస్టాఫీస్ వద్ద సోమవారం పోస్టల్ పథకాలుపై కళాజాతను నిర్వహించారు. పోస్టల్ ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతిని సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎలమంచిలి సబ్ డివిజనల్ పోస్టల్ ఎంఒ ఎస్.కన్నయ్యనాయుడు, రాంబిల్లి బీపీఎం డి.జగన్నాథరాజు, సిబ్బంది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కుక్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

రాంబిల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికా విద్యాలయంలో హెడ్‌కుక్ నియామకానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాసులు ఆహ్వానిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారి ఎం. సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 18 సంవత్సరాలు నుంచి 42 సంవత్సరాలు వయస్సులోపు గల మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అక్టోబరు 15వ తేదీ సాయంత్రం 5గంటలు లోపు అర్హత గల మహిళలు ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పుట్టినరోజు ధ్రువపత్రాలతో ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు.

పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న టీడీపీ నేత సిగిరెడ్డి నాయుడు

రాంబిల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిమిలిలో బాల త్రిపుర సుందరిదేవి శరన్నవరాత్రులు ముగింపులో భాగంగా సోమవారం టీడీపీ నాయకులు, పాల సంఘం ప్రెసిడెంట్ సిగిరెడ్డి నాయుడు 80 మంది పేదలకు దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ అమ్మవారి పేరు మీద ప్రతి ఏటా తనకు ఉన్నంతలో పేదలకు సాయం చేస్తున్నట్టు చెప్పారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు నగిరెడ్డి నాని, చిన్ని, అప్పారావు పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

చీడికాడ, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): 18 నిండని బాలికలకు వివాహం చేస్తే కేసులు నమోదు చేస్తామని మాడుగుల ఐసీడీఎస్ పీవో శ్రీదేవి హెచ్చరించారు. మండంలోని తురువోలు గ్రామానికి చెందిన నీలి పైడితల్లితో ఎస్.రాయవరం మండలం ఓ గ్రామానికి చెందిన ఓ బాలికతో ఈనెల 16న వివాహం చేయడానికి ఇరు కుటుంబీకులు నిశ్చయించారు. దీనిపై తురువోలు మహిళ పోలీస్ సుజాత ఆదివారం రాత్రి ఐసీడీఎస్ కార్యాలయానికి ఫోన్ ద్వారా ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం మధ్యాహ్నం గ్రామ పెద్దలు, పెళ్లి కుటుంబీకుల సమక్షంలో విచారణ చేశారు. పీవో శ్రీదేవి అనంతరం పెళ్లి కుమారుడు, వారి పెద్దలతో బైండోవర్ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ గోవింద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సులు

నర్సీపట్నం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 14: త్వరలో ట్రాఫిక్ నిబంధనలు, రహదారుల భద్రతపై కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ఎన్. రమేశ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిబంధనలు ప్రకారం డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తితోపాటు వెనక కుర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలన్నారు. తన పరిధిలోని 12 మండలాల్లో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దసరా సందర్భంగా కాంట్రాక్ట్ కేరియర్ సర్వీసులు అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, కేసులు రాశామని తెలిపారు.

చినప్పన్నపాలెంలో ఆలయ ప్రారంభ మహోత్సవాలు

బుచ్చెయ్యపేట, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): చినప్పన్నపాలెంలో పైడిమాంబ నూతన ఆలయ ప్రారంభ మహోత్సవాలు సోమవారం శాస్త్రోయుక్తంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పరిహత్ ప్రాయశ్చితం, పంచగవ్యారాధన, ఋత్విక్ వరుణ, రక్షా సూత్రధారణ, అఖండదీప స్థాపన, వాస్తు యోగిని, అగ్ని ప్రతిష్ట, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


యజ్ఞశాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన: ఆర్‌టీవో



నర్సీపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): త్వరలో ట్రాఫిక్ నిబంధనలు, రహదారుల భద్రతపై కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ఎస్. రమేశ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిబంధనలు ప్రకారం బైక్ డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తితో పాటు వెనక కుర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని అన్నారు. రీజనల్ రవాణా శాఖ కార్యాలయం పరిధిలోని 12 మండలాల్లో తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆయాచోట్ల ప్రమాద నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దసరా పండగ సందర్భంగా కాంట్రాక్ట్ కేరియర్ సర్వీసులు అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కేసులు రాశామని తెలిపారు.

పశు వైద్య కేంద్రానికి రాకపోకలకు వీలుగా కల్వర్టు నిర్మాణం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


నాతవరం పశువైద్యకేంద్రానికి ఎదుట నిర్మించిన కల్వర్టు

నాతవరం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 14 : నాతవరం పశు వైద్యకేంద్రం వద్ద గెడ్డకు కల్వర్టు నిర్మాణాన్ని అధికారులు పూర్తి చేశారు. ఇక్కడ కల్వర్టు లేక నూతన పశువైద్య కేంద్రం ఏడాదిగా నిరుపయోగంగా మారింది. దీంతో ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు స్పందించారు. ఎట్టకేలకు పశువైద్యకేంద్రానికి వెళ్లడానికి వీలుగా గెడ్డకు వద్ద కల్వర్టు నిర్మాణ పనులు పూర్తిచేశారు. ఇప్పటివరకు శిథిల భవనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కొత్త పశువైద్యకేంద్రంలోకి మారితే తమ కష్టాలు గటెక్కుతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాల నివారణ



గొలుగొండలో రహదారి భద్రతా వారోత్సవాలపై ర్యాలీ చేస్తున్న వెలుగు సిబ్బంది

గొలుగొండ , అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రహదారి భద్రతా వారోత్సవాలపై వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘ సభ్యులకు అవగాహన కార్య క్రమం నిర్వహించారు. రోడ్లపై ప్రయాణాల సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వెలుగు ఏపీఎం కరుణానిధి ఈ సందర్భంగా తెలిపారు. హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. సైబర్ క్రైమ్, గంజాయి వాడకంలో చిన్నారులను అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

రూ. 5,09 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం

చీడికాడ, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికిగాను రూ.5కోట్ల 9లక్షల 90వేలు నిధులు మంజూరైనట్టు ఎంపీడీవో హేమసుందరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, జి.కొత్తపల్లి పంచాయతీకి రూ.60.70 లక్షలు, పెదగోగాడకు రూ.28 లక్షలు, చెట్టుపల్లికి రూ.17.87 లక్షలు, బైలపూడికి రూ.14.61 లక్షలు, ఖండివరం రూ.86.20 లక్షలు, తురువోలు రూ.40 లక్షలు, దండిసురవరానికి రూ.33.30 లక్షలు, మంచాలకు రూ.44 లక్షలు, కోనాంకి రూ.72.30లక్షలు, చీడికాడకు రూ.80 లక్షలు, ఎల్‌బి.పట్నం రూ.33 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ పనులను ఈనెల 17వ తేదీన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభిస్తారన్నారు.

బాల్య వివాహం నిలుపుదల

చీడికాడ, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): 18 నిండని బాలికలకు వివాహం చేస్తే కేసులు నమోదు చేస్తామని మాడుగుల ఐసీడీఎస్ పీవో శ్రీదేవి హెచ్చరించారు. మండంలోని తురువోలు గ్రామానికి చెందిన నీలి పైడితల్లితో ఎస్.రాయవరం మండలం ఓ గ్రామానికి చెందిన ఓ బాలికతో ఈనెల 16న వివాహం చేయడానికి ఇరు కుటుంబీకులు నిశ్చయించారు. దీనిపై తురువోలు మహిళా పోలీస్ సుజాత ఆదివారం రాత్రి ఐసీడీఎస్ కార్యాలయానికి ఫోన్ ద్వారా ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం మధ్యాహ్నం గ్రామ పెద్దలు, పెళ్లి కుటుంబీకుల సమక్షంలో విచారణ చేశారు. పీవో శ్రీదేవి అనంతరం పెళ్లి కుమారుడు, వారి పెద్దలతో బైండోవర్ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ గోవింద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బాణసంచా స్వాధీనం


ఏటిగైరంపేటలో స్వాధీనం చేసుకున్న మందుగుండు

గొలుగొండ, అక్టోబరు 14:(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటిగైరంపేట గ్రామంలో ఓ వ్యాపారి వద్ద దాడులు నిర్వహించి బాణసంచా స్వాధీనం చేసుకున్నట్టు నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. ముందస్తు సమాచారంతో దాడి చేసి కేతవరపు జగదీష్ వద్ద విలువ సుమారు రూ. లక్ష విలువైన బాణ సంచా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయనపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. అనుమతులు లేకుండా దీపావళి, నాగులచవితి పండ గల కు మందుగుండు సామగ్రి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన


కొంగసింగిలో సీసీరోడ్డుకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు, అధికారులు

గొలుగొండ, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): పల్లె పండగ క్యాక్రమంలో భాగంగా రహదారుల నిర్మాణానికి టీడీపీ కూటమి నాయకులు సోమవారం శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని కొమిర, ఏటిగైరంపేట, గ్రామపంచాయతీ శివారు సీతకండి, పప్పుశెట్టిపాలెం, పాతమల్లంపేట గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో ఏటిగైరంపేట ఎంపీటీసీ సభ్యురాలు చింతల కాంతం, సర్పంచ్ రామకృష్ణ, మామిడి ఆదిలక్ష్మి, టీడీపీ నాయకులు కొల్లి సత్యనారాయణ, సీహెచ్. సాంబమూర్తి పాల్గొన్నారు.

ఎంపీడీవోను కలిసిన పశువైద్య సిబ్బంది


ఎంపీడీవోకు జ్ఞాపిక అందజేస్తున్న పశువైద్య సిబ్బంది

చీడికాడ, అక్టోబరు 14, ఆంధ్రజ్యోతి): చీడికాడ ఎంపీడీవో గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హేమసుందరరావును రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న పశువైద్య సిబ్బంది సోమవారం కలిసి సన్మానించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, సిబ్బంది సమయ పాలన పాటించి పాడిరైతులకు మరిన్ని సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకుడు ఎల్.కామేశ్వరరావు, పీఆర్ఏఈ శరగడం పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రహరీ వద్ద నిలిచిన డ్రైనేజీ


అయ్యప్పస్వామి గుడి వద్ద అసంపూర్తి కాలువ


మెయిన్ రోడ్డులో తవ్వేసి వదిలేసిన కాలువ

మురుగునీరు ముంచెత్తుతోంది!

నర్సీపట్నం మెయిన్ రోడ్డు దుర్గంధ పూరితంగా మారింది. రహదారి విస్తరణలో భాగంగా డ్రైనేజీ పనులను అసంపూర్తిగా చేపట్టి వదిలేశారు. ఫలితంగా ఎక్కడిక్కడ మురుగునీటి నిల్వలు దర్శనమిస్తున్నాయి. ప్రయాణికులు, వ్యాపారులు నరకం చూస్తున్నారు.

- అస్తవ్యస్తంగా నర్సీపట్నం మెయిన్‌రోడ్డు
- రహదారి విస్తరణలో భాగంగా అసంపూర్తి పనులు
- వాడుక నీటితో దుర్గంధం
- వ్యాపారులు, ప్రజలకు అవస్థలు

నర్సీపట్నం, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్ రోడ్డులో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా మారింది. రోడ్డు విస్తరణలో భాగంగా గత ప్రభుత్వంలో కొత్తగా డ్రైనేజీ కాలువల నిర్మాణానికి వీలుగా అప్పటి వరకు ఉన్న కాలువను తవ్వేశారు. మెయిన్ రోడ్డు విస్తరణ పనులు నిలిచి పోవడంతో డ్రైనేజీ పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. పాత డ్రైనేజీ ఉన్నప్పుడు కొద్దిగానైనా నీరు పారేది. ఇప్పుడు అసంపూర్తి పనులతో ఎక్కడ నీరు అక్కడ నిలిచి పోయి దుర్గంధం వ్యాపిస్తోంది. వర్షం వస్తే మురుగునీరంతా రహదారి పైకి వచ్చి చేరుతోంది. నర్సీపట్నం అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు రోడ్డు విస్తరణ, సెంటర్ డివైడర్, గ్రీనరీ, ఇరువైపులా డ్రైనేజీ అభివృద్ధి పనులకు గత వైసీపీ ప్రభుత్వంలో రూ.10.6 లక్షలు మంజూరయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువ నిర్మించి, పుట్‌పాత్‌కు వీలుగా కాంక్రీటు పలకలు అమర్చాలి. రోడ్డుకి ఇరువైపులా ఉన్న భవనాలు నష్టపోయిన యజమానులు నష్ట పరిహారం డిమాండ్ చేస్తూ హై కోర్టుని ఆశ్రయించి స్టే తెచ్చారు. ఎక్కడికక్కడ పనులు నిలిచి పోయాయి. అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు 1500 మీటర్లు, 3000 వేల మీటర్లు డ్రైనేజీ పనులు చేయాల్సి ఉండగా, అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు 260 మీటర్ల మేర మాత్రమే బీటీ రోడ్డు, సెంటర్ డివైడర్ పనులు చేశారు. 3 వేల మీటర్లు డ్రైనేజీ పనులు చేపట్టాల్సి ఉంది. అబీద్ సెంటర్‌లో ఎడమ వైపు ఎన్‌జీవోస్ హోమ్ భవనం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. అక్కడితో పనులు ఆపేశారు. మెయిన్ రోడ్డుకి కుడి వైపు ఎన్టీఆర్ మిని స్టేడియం నుంచి స్వామి అయ్యప్ప గుడి వరకు డ్రైనేజీ నిర్మి చారు. ఆలయ కమిటీ తరపున హై కోర్టుకి వెళ్లి స్టే తేవడంతో అక్కడ పనులు నిలిచిపోయాయి. తర్వాత పంచాయతీరాజ్ కార్యాలయం ముందు నుంచి సిటీ క్లబ్, పాల్‌ఘాట్ సెంటర్ వరకు డ్రైనేజీ పనులు చేశారు. విత్తనాలు షాపు నుంచి డ్రైనేజీ పనులు ముందుకు సాగలేదు. పాత డ్రైనేజీ తవ్వేసి వదిలేయడంతో నీరు నిలిచిపోతోంది. పెదబొడ్డేపల్లి మదుం నుంచి అక్కడక్కడ డ్రైనేజీ కాంక్రీట్ పనులు పూర్తి చేశారు. వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మురుగునీటితో దోమల వృద్ధితో నిత్యం నరకం అనుభవిస్తున్నామని వ్యాపారులు వాపోతున్నారు.

అర్జీల సత్వర పరిష్కారానికి కృషి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో రమణ


అర్జీలు పరిశీలిస్తున్న ఆర్డీవో వీవీ రమణ

నర్సీపట్నం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 14: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలు సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆర్డీవో వీవీ రమణ ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. 1994లో కోటవురట్ల మండలం గొట్టువాడ రెవెన్యూ పరిధిలోని సర్వే 151లో ప్రభుత్వ భూమి మంజూరు చేశారని, నాటి నుంచి నేటి వరకు సరిహద్దులు భూమి అప్పగించడం లేదని రాట్నాలపాలెంనకు చెందిన కోరిబిల్లి వరాలు, మునగాడ చిన్నమ్మ వినతి పత్రం ఇచ్చారు. గొలుగొండ మండలం గుండుపాల లో ఉన్న 900 రేషన్ కార్డుదారులకు నిత్యావసరాల పంపిణీలో జాప్యమవుతుందని గ్రామస్తులు గుమ్మిడి చిన్నారావు, రమణ తెలిపారు. రెండో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. నర్సీపట్నం ఎస్సీ కాలనీకి చెందిన ఎన్ భాగ్యవతి భర్త శ్రీనివాసరావు చిన్న వయస్సులో గుండెపోటుతో మరణించాడని, చంద్రన్న బీమా పథకం మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. మునిసిపాలిటీలో పబ్లిక్ కుళాయిలనుంచి నీటి వృథాను అరికట్టాలని ఆర్ అప్పారావు ఫిర్యాదు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి 14 మంది ఆర్డీవోకి అర్జీలు అందజేశారు.

రేపు జాబ్‌మేళా

చోడవరం, అక్టోబర్ 14: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 16 బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ పి. కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. స్కిల్‌హబ్ ద్వారా నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన 10వ తరగతి నుంచి డిగ్రీ ఆపై విద్యార్హత కలిగిన అభ్యర్థులు పాల్గొనవచ్చని సూచించారు. ప్రముఖ కంపెనీలు వరుణ్‌మోటార్స్, అపోలో, హెల్త్‌కేర్ సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. పూర్తి వివరాలకోసం స్కిల్ హబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఫోన్: 9494791935కి సంప్రదించాలని తెలిపారు.

కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి


ప్రిన్సిపల్ అప్పరాజుకు వినతిపత్రం అందిస్తున్న లెక్చరర్లు

రోలుగుంట, అక్టోబరు 14 : ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసును క్రమబద్ధీకరించాలని కోరుతూ సోమవారం స్థానిక జూనియర్ కళాశాల అధ్యాపకులు పసుపు రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. జీఓ 114ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 19 వరకు వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ అప్పలరాజుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు పి.శ్రీనివాసరావు, బీవీఎస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల మండలంలో నేడు 'పల్లెపండగ'

మాడుగుల రూరల్: మండలంలోని కెజె.పురం, తాటిపర్తి, శంకరం పంచాయతీల్లో పల్లె పండగను మంగళవారం, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉదయం 9 గంటలకు కె.జె.పురం రావాలని కూటమి నేతలు కోరారు. ఉపాధి హామీపథకం నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీలు, స్మశానవాటికల్లో బిల్డింగ్, ప్రహరీ తదితర పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారు.

ఉపాధి నిధులు అవకతవకలపై విచారణ


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందరరావు

చీడికాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగోగాడలో ఉపాధి పథకం నిధుల్లో అవతకవలకు జరిగినట్టు వచ్చిన ఫిర్యాదుపై విచారణ పూర్తిచేశామని ఎంపీడీవో వి.హేమసుందరరావు తెలిపారు. మండలంలో గ్రామానికి చెందిన ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ తమ కుటుంబ సభ్యులు ఉపాధి పనికి రాకుండా అదనంగా మస్తర్లు వే శారని గ్రామానికి చెందిన పైల జగన్నాథం జిల్లా అధికారులకు ఇచ్చిన ఫిర్యాదుమేరకు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి కూలీలు, ఫిర్యాదుదారుల సమక్షంలో ఎంపీడీవో విచారణ చేశారు. ఒక్కొక్కరి అభిప్రాయాలు అడిగి రికార్డుచేశారు. మిగతా రికార్డులు పరిశీలించి ఈ నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తానని ఎంపీడీవో తెలిపారు. ఆయనతోపాటు ఏపీవో గంగునాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ కె.ఎర్రునాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కూటమి పాలనలో పల్లెలకు వెలుగు

- ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, కేఎస్ఎన్ రాజు
- ఘనంగా పల్లె పండుగ ప్రారంభం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


కంచుగుమ్మలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజు

కె. కోటపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నిధులను మళ్లించి నిర్వీర్యంచేసిన పంచాయతీల్లో కూటమి ప్రభుత్వం రాకతో తిరిగి వెలుగు వస్తోందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. పల్లె పండగ సందర్భంగా సోమవారం మండలంలోని సింగన్నదొరపాలెంలో మాట్లాడారు. పంచాయతీ ఖాతాల్లో నిధులులేక కనీస పారిశుధ్య పనులు చేపట్టలేదని విమర్శించారు. ఈ స్థితిలో కేంద్రం ఇచ్చిన నిధులను నేరుగా పల్లె ఖాతాలకు మళ్లించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో 1182 పనులకు రూ. 102.12 కోట్లు నిధులు విడుదల కాగా ఒక్క మాడుగుల నియోజకవర్గానికి అత్యధికంగా రూ. 27.21 కోట్ల నిధులు విడుదలయ్యాయన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజిలు, బీటీ రోడ్లు వేస్తామన్నారు. డ్వామా పీడీ పూర్ణిమాదేవి మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి మూలమైన ఉపాధి హామీ పథకం పక్కాగా అమలు చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బండారు మండలంలోని సింగన్నదొరపాలెం, కె.జె. పురం, పోతనవలస గ్రామాల్లో అభివృద్ధిపనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు,మండల ప్రెసిడెంట్ రొంగలి మహేష్, ఉమ్మడి జిల్లాల సర్పంచ్ చాంబర్ అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడు, సర్పంచులు వెలగల లక్ష్మి, యడ్ల ఎరుకమ్మ, చిరికి భార్గవి, ఎంపీడీవో సాంబశివరావు, ఉప తహసీల్దార్ రమేష్‌బాబు, అగ్రికల్చర్ ఆఫీసర్ సోమశేఖర్, నాయకులు వెలగల పైడమునాయుడు, సబ్బవరపు రామునాయుడు, కన్నూరు సూర్యనారాయణ, డోకల నరసింహమూర్తి, వెలగల జగదీష్, బండారు ప్రసాద్, బండారు లక్ష్మణ్, పైలా అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా శరభవరం, కొవ్వూరు, కంచుగుమ్మల, జె.నాయుడుపాలెం గ్రామాల్లో పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జె.నాయుడుపాలెంలో కేజీబీవీ హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గుమూలూరు చంద్రమౌళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, బండారు శ్రీనివాసరావు, బోడాపాత్రుని నరేశ్, బంటు రాజు, కోలిపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం రూరల్: మండలంలోని గబ్బాడ, నీలంపేట పంచాయతీల్లో జెడ్పీటీసీ సభ్యులు సుకల రమణమ్మ పల్లె పండగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 9.85 లక్షలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ సమయంలో పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసినట్టు చెప్పారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, తాగునీటి పథకాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, పీఆర్ జేఈ నర్సింగరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు లాలం శ్రీరంగ స్వామి, గబ్బాడ సర్పంచ్ ఈర్లి రాజేశ్వరి పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

నాతవరం: మండలంలోని చినగొలుగొండపేట గ్రామంలో మహిళలు తమకు కుటిర పరి శ్రమలు ఏర్పాటుచేయాలని కోరారు. సోమవారం పల్లెపండగ నిర్వహించారు. ఇందులో భాగంగా పీఆర్ డీఈ రాజేశ్వరరావు అభివృద్ధి పనులు వివరిస్తుండగా మహిళలు తమకు కుటీర పరి శ్రమ ఏర్పాటుచేసి పనులు కల్పించాలని కోరారు. అనంతరం మాజీ జడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ మాట్లాడుతూ చినగొలుగొండపేటలో పంచాయితీ భవనం ఏర్పాటు చేయాలని కోరారు. వెదురుపల్లి-గొలుగొండపేట రోడ్డుకు, మన్యపురట్ల - రాజుపేట అగ్రహారం రహదారులకు రూ. 68 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్టు వివరించారు. ఈకార్య క్రమంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు బంగారు సూరిబాబు, ఎపీఓ చిన్నారావు, జేఈ వెంకటేశ్వరమ్మ, టీడీపీ నాయకులు పారుపల్లి కొండబాబు, విజయ్‌కుమార్ సింగంపల్లి సన్యాసిదేముడు,సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట: మండలంలోని కొంగసింగి గ్రామంలో మూడు చోట్ల సీసీ రోడ్లకు స్థానిక సర్పంచ్ యలమంచిలి నూకరత్నం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రావు, జనసేన, టీడీపీ నాయకులు మల్లేష్, లగుడు శ్రీనివాస్, వరహాలబాబు, మణిబాబు పాల్గొన్నారు.

మాకవరపాలెం: గ్రామాలు అభివృద్ధికి ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఆర్‌వై. పాత్రుడు అన్నారు.సోమవారం పల్లె పండుగ సందర్భంగా గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా తూటిపాలలో రూ. 10లక్షలతో సీసీ రోడ్డు, తాడపాలలో రూ. 10లక్షల, బూరుగుపాలెంలో రూ.10 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, టీడీపీ నాయకులు కేతిరెడ్డి చిరంజీవి,భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నందకిశోర్, ఎస్.,రమణ పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి నిమజ్జనం

చింతపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దుర్గాదేవి నిమజ్జనం సోమవారం వైభవంగా జరిగింది. సోమవారం రంగా సెంటర్‌లో ఏర్పాటుచేసిన దుర్గాదేవికి భక్తులు సారెను సమర్పించారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని మండల కేంద్రంలోని పురవీధుల్లో సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగించి చౌడుపల్లి చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, నిర్వాహక కమిటీ సభ్యులు వసుపరి హంసరాజు, శ్రీనివాసరావు, సత్తిబాబు, లోవ, సాయి, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పద్మకుమారి, టీడీపీ నాయుడు చింతాడ చిన్న పాల్గొన్నారు.



చింతపల్లిలో అమ్మవారికి సారెను ఊరేగిస్తున్న భక్తులు



ధారకొండలో దుర్గాదేవిని ఊరేగిస్తున్న దృశ్యం

ధారకొండలో..

సీలేరు: జీకేవీధి మండలం ధారకొండలో సోమవారం దుర్గాదేవి అమ్మవారి నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ధారకొండ, గుమ్మిరేవులకు చెందిన మహిళలు ధింసా నృత్యాన్ని ప్రదర్శించారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

చింతపల్లి, అక్టోబరు 14: జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్టు అధ్యాపకులు సోమవారం ఆందోళన చేశారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కాంట్రాక్టు అధ్యాపకులు కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న అధ్యాపకులను రెగ్యుల్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. డిసెంబరు నాలుగు వరకు దశలవారీగా ఆందోళనలు, నిసనలు చేపడుతూ పాలకులకు వినతులు అందజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు కేవీ రత్నం, హరికృష్ణ, ఈశ్వరరావు నాయుడు, మోదినాయుడు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆవరణలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు శ్రమదానం

గూడెంకొత్తవీధి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో జంగిల్‌ని తూరు మామిడి పోలీసు అవుట్ పోస్టు సీఆర్‌పీఎఫ్ జవాన్లు శుభ్రం చేశారు. సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సీఆర్‌పీఎఫ్ ఏ234 బెటాలియన్ జవాన్లు శ్రమదానం చేశారు. పీహెచ్‌సీ ఆవరణలోనున్న తుప్పలు, చెత్తను తొలగించారు. ఈసందర్భంగా సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఏకే నాయక్ మాట్లాడుతూ గృహాలతోపాటు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీశ, జవాన్లు పాల్గొన్నారు.



పెదవలస పీహెచ్‌సీ ఆవరణలో శ్రమదానం చేస్తున్న దృశ్యం

సచివాలయ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

పాడేరురూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు ఎల్.సుందరరావు ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంల సంఘం జిల్లా నాయకులు సోమవారం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అంతకు ముందు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను మెడికల్ డిపార్టుమెంట్ పరిధిలోకి మార్చాలని, ఫేషియల్ రిగ్నెస్సీ సచివాలయంలోనే వేయాలనే నిబంధనను తొలగించి ఏ గ్రామంలో విధులకు వెళితే అక్కడే వేసేలా అవకాశం కల్పించాలని, సీనియారీ జాబితా ప్రకారం గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2కు పదోన్నతులు కల్పించాలని, ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు సుశీల, బేబీరాణి, కుమారి, భవాని, శెట్టి సుశీల, పూర్ణ, బుల్లమ్మ, పద్మ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఏఎన్‌ఎంలు

గ్రామ సభల తీర్మానంపైనే మద్యం షాపులివ్వాలి: సీపీఎం

హుకుంపేట అక్టోబరు, (ఆంధ్రజ్యోతి) 14: గ్రామ సభల ఆమోదంతోనే ప్రభుత్వం నూతన మద్యం షాపులు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు అప్పనర్సయ్య తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మద్యం దుకాణాల కేటాయింపులో ఆదివాసీ చట్టాలను ఉల్లంఘించి, లాటరీ పద్ధతిలో కేటాయించడం సరికాదన్నారు. గిరిజన చట్టలు హక్కులు అమలు చేసి పీసా చట్టం ప్రకారం.. గిరిజనులకే మద్యం షాపులు కేటాయించాలన్నారు. ఈ కార్య క్రమంలో నేతలు కోండలరావు, హైమావతి, కృష్ణారావు, పడల్ క్రిష్ణమూర్తిపాల్గొన్నారు.

అధ్వానంగా కొర్రాపర్తి-వెలగలపాడు రోడ్డు

- గిరిజనుల అవస్థలు
- జంగిల్ క్లియరెన్స్ లేక ప్రమాదాలు
- గోతులతో భీతిల్లుతున్న వాహనదారులు
- పూర్తిగా మరమ్మతులు చేపట్టని ఆర్‌అండ్‌బీ అధికారులు

అనంతగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల రోడ్లు వర్షాలకు పూర్తిగా అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు, గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కనీసం రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించకపోవడంతో గుంతల రోడ్లపై ఐదేళ్లపాటు గిరిజనులు ప్రయాణాలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. పలువురు గిరిజనులు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి.

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం శారదా నదిపై వంతెనను ఆనుకుని అనంతగిరి మండలం జీనబాడు, పినకోట, పెదకోట, కివర్ల ఈ నాలుగు పంచాయతీ ఉన్నాయి. ఈ పంచాయతీల్లో సుమారు వందపైగా గ్రామాల గిరిజనులు జీవిస్తున్నారు. పదేళ్ల క్రితం దేవరాపల్లి నుంచి జీనబాడు మీదుగా పినకోట, పెదకోటను కలుపుకుంటూ కివర్ల పంచాయతీ జాలడ వరకు సుమారు రూ.6కోట్లతో తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. మూడేళ్ల వరకు తారురోడ్డు బాగానే ఉన్నప్పటికీ తరువాత పడిన వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతలను ఆర్‌అండ్‌బీ అధికారులు కొంతవరకు పూడ్చారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగున్నరేళ్లు మరమ్మతులకు పైసా కూడా నిధులు మంజూరు చేయకపోవడంతో రోడ్లు దారుణంగా తయారయ్యాయి. దీంతో గిరిజనులు గుంతల రోడ్లపై అవస్థలు పడుతూ ప్రయాణాలు సాగించారు.

6నెలల క్రితం రూ.1.5కోట్లతో మరమ్మతులు

దిబ్బలపాలెం నుంచి పినకోట, పెదకోట వరకు 5.8 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు ఆర్‌అండ్‌బీ శాఖ రూ.1.5 కోట్లు మంజూరు చేసింది. అయితే కొర్రాపర్తి నుంచి వెలగలపాడు వరకు రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో 1.5 కిలోమీటర్లు రోడ్డు అధ్వానంగా మారి ప్రయాణానికి వీలు లేకుండా పోయింది. పినకోట సమీపంలోని భైరవమూర్తి ఆలయం వద్ద సీసీ రోడ్డు పూర్తిగా పాడైపోయింది. దీంతో గిరిజనులే కొంతవరకు బాగు చేసుకున్నారు. దిబ్బపాలెం నుంచి ఇటు జీనబాడు వరకు.. అటు పెదకోట నుంచి కివర్ల పంచాయతీ జాలడ వరకు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో అత్యవసర సమయాల్లో గిరిజనులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



వర్షాపు నీటితో నిండిన గొయ్యి గుంత



పాడైన కొర్రాపర్తి-వెలగలపాడు రోడ్డు

జంగిల్ క్లియరెన్స్ లేక ప్రమాదాలు

-జీనబాడు నుంచి జాలడ వరకు రోడ్డుకు ఆనుకుని తుప్పలు ఏపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడం పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలోని శ్రీరామనవమి పండుగపూట గిరిజనుల కుటుంబాల్లో విషాదం నింపింది. ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు గిరిజనులు మృత్యువాతపడగా.. మరో గిరిజనుడు తీవ్రంగా గాయపడి కుటుంబాలకు తీరని వేదన మిగిల్చారు. జంగిల్ క్లియరెన్స్ లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదానికి గురై, పలువురు గిరిజనులు మృత్యువాత పడుతున్నారు.

అధ్వానంగా రోడ్డును బాగు చేయాలి

బి.రాజు, కొర్రాపర్తి గ్రామం

కొర్రాపర్తి నుంచి వెలగలపాడు వరకు రోడ్డంతా అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. కొంతవరకు మరమ్మతులు చేపట్టిన ఆర్‌అండ్‌బీ శాఖ మిగతా రోడ్డుపై దృష్టి పెట్టలేదు. అధికారులు స్పందించి, రోడ్డు మరమ్మతులపై దృష్టిసారించాలి.

ఆర్టీసీ కాంప్లెక్స్ రద్దీ

- దసరా సెలవులు ముగియడంతో విద్యార్థుల తిరుగు ప్రయాణం
- కిక్కిరిసిన బస్ కాంప్లెక్స్, ప్రైవేటు జీపుల స్టాండ్

పాడేరురూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దసరా సెలవులు ముగియడం, విద్యా సంస్థలు సోమవారం నుంచి ప్రారంభం కావడంతో తిరుగు ప్రయాణికులతో పాడేరులోని ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రైవేటు జీపుల స్టాండ్ రద్దీగా మారాయి. విశాఖ, అనకాపల్లి, గుంటూరు, చోడవరం, విజయవాడ తదితర ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు, అలాగే మన్యంలో వివిధ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆయా విద్యా సంస్థలకు వెళ్లడానికి రావడంతో ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రైవేటు జీపుల స్టాండ్ కిటకిటలాడాయి. పాడేరు నుంచి మైదాన ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు సకాలంలో లేకపోవడంతో ప్రయాణికులు కాంప్లెక్స్‌లో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అలాగే పాడేరులోని మెడికల్ కళాశాలలో సోమవారం నుంచి తరగతులు ప్రారంభం కావడంతో మైదాన ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులతో బస్సులు రద్దీగా కనిపించాయి. చింతపల్లి, జి.మాడుగుల, అరకు తదితర ప్రాంతాల్లోని కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో ప్రైవేటు జీపుల స్టాండ్ కిక్కిరిసిపోయింది.



రద్దీగా ఉన్న ప్రైవేటు జీపుల స్టాండ్

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న బీడీ టీమ్

డుంబ్రిగుడ, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగా విస్తృత తనిఖీలు చేపడుతున్నట్టు స్థానిక ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు. మండలంలో ప్రధాన రహదారుల్లోని కల్వర్టు, వంతెనలు బీటీటీమ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక బలగాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

18న జాబ్‌మేళా

అరకులోయ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ఆర్‌ఐటీఐలో ఈ నెల 18 వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డా.పి.రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 3 గంటల వరకు ఈ ప్ర క్రియ కొనసాగుతుందన్నారు. ఈ జాబ్‌మేళాకు అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకు, భారత్ పే యు తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 18నుంచి 30 ఏళ్ల వయసు గల ఇంటర్, డిగ్రీ, డిప్లొమా,బీటెక్ చదివిన వారు ఈ జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. పాన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువ పత్రాలతో పాల్గొవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు వేతనం రూ.10 వేల నుంచి రూ.20 వేల అందిస్తారన్నారు.

అనాథ చిన్నారులు సంరక్షణ కేంద్రానికి తరలింపు

- సీడీపీవో బాలమణి దేవి

హుకుంపేట అక్టోబరు, (ఆంధ్రజ్యోతి) 14: మండంలోని మఠం పంచాయతీ గన్నేరు పుట్టు గ్రామంలో తండ్రి దాడిలో తల్లిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులను బాలల సంరక్షణ గృహానికి తరలిస్తామని సీడీపీవో బాలమణి దేవి తెలిపారు. గన్నేరు పుట్టు గ్రామానికి చెందిన పనసంతో కలిసి సోమవారం స్థానిక సర్పంచ్ శాంతి కుమారి అధ్వర్యంలో సీడీపీవోకు ఆ చిన్నారులను అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తల్లి దండ్రులు లేని ఈ పిల్లలకు ప్రభుత్వ బాలల సంరక్షణ గృహంలో చేర్పించి చదువులు కల్పిస్తామన్నారరు. కిముడు లబో భార్యను హత్య చేయటంతో ఆయన జైలులో ఉన్నారన్నారు. సంబంధిత ఆదికారుల ఆదేశాల మేరకు అనాథలైన శ్రావణి బాబు, పవన్‌లకు రక్షణగా ఉంటామన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివ కృష్ణ, వార్డు మెంబరు మత్యకోండబాబు, మహిళా పోలీసులు సత్యవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అప్పల నర్సమ్మ, డీసీపీయూ సద్దు పాల్గొన్నారు.



చిన్నారులతో సీడీపీవో, సర్పంచ్ శాంతికుమారి

కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను రెగ్యులర్ చేయాలి

హుకుంపేట అక్టోబరు, (ఆంధ్రజ్యోతి) 14: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కాంట్రాక్టు లెక్చరర్స్ తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ జీవో 114 ప్రకారం తమను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 19 వరకు ఈ డిమాండ్‌పై నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు మత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి అరకులోయలో ఎస్‌జీఎఫ్ ఆర్చరీ ఎంపికలు

పాడేరురూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో విశాఖ ఉమ్మడి జిల్లా ఆర్చరీ అండర్-14, 17 విభాగం బాలుర, బాలికల ఎంపికలు ఈనెల 16వ తేదీన అరకువేలి ఏపీటీడబ్ల్యూఆర్ స్పోర్ట్స్ స్కూల్లో నిర్వహించనున్నామని డీఈవో పి.బ్రహ్మాజీరావు తెలిపారు. ఈ ఎంపికలకు హాజరయ్యే విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల క్రీడాకారులు ఎలిజిబులిటీ ఫామ్, మిడ్డే మీల్స్ ఎక్విటెన్స్ విధిగా తీసుకురావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కొండబాబు పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

పాడేరురూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ సాధికారత అధికారి జి.జనార్దనరావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసి మూడు నెలలు శిక్షణ అందిస్తామన్నారు. ఉచిత శిక్షణపై ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 11వ తేదీ నుంచి 21వ తేదీలోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ (హెచ్‌టీటీపీఎస్://ఎండీఎఫ్‌సీ.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్/, హెటీటీపీఎస్:/జన్మభూమి.ఏపీ.జీవోటీ.ఇన్) ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు. ఎస్టీటీలకు ఇంటర్మీడియట్‌తోపాటు డైట్ సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్స్‌కు డిగ్రీ, బీఈడీ, టెట్ విద్యార్హతలు కలిగిన వారు అర్హులన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 2 లక్షల 50 వేలులోపు కలిగిన విద్యార్థులు అంతా అర్హులన్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు హాల్ టిక్కెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, 27వ తేదీన ఆన్‌లైన్ పరీక్ష ఉంటుందని, 28న మెరిట్ లిస్టు ప్రకటిస్తారన్నారు. జిల్లాల వారీగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను 30న ప్రకటిస్తామని, నవంబరు 6వ తేదీ నుంచి కోచింగ్ ప్రారంభిస్తారన్నారు.

గంజాయి సాగు నిర్మూలనకు చర్యలు

పాడేరురూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో గంజాయి సాగు చేపట్టే ప్రాంతాలు, రవాణా జరిగే మార్గాలపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని సీఐ డి.దీనబంధు తెలిపారు. సోమవారం మండలంలోని సంగోడి, సల్ధిగెడ్డ, సప్పిపుట్టు, కించూరు, వల్లాయి, బడిమెల, గొండెలి గ్రామాల పరిసర ప్రాంతాల్లో వాగుల సమీపంలో గంజాయి సాగు చేసే ప్రదేశాల్లో పాత నేరస్తులు ఎవరైనా సాగు చేపడుతున్నారన్న అనుమానంతో డ్రోన్ సహాయంతో తనిఖీలను చేపట్టామన్నారు. అదేవిధంగా గంజాయి రవాణాపై కూడా డ్రోన్ సహాయంతో నిఘా పెట్టామన్నారు. మండలంలో ఇప్పటికే గంజాయి కేసుల్లో ఉన్న పాత నేరస్తులకు తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్‌లు చేయించామన్నారు.

ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ రాజారావు మృతి

చింతపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ కె.రాజారావు(55) అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలా వున్నాయి. దసరా సెలవులకు శుక్రవారం చింతపల్లి నుంచి విశాఖపట్నం వేపగుంటలోనున్న స్వగృహానికి వెళ్లారు. ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో ఆయాసం వచ్చింది. నిమిషాల వ్యవధిలోనే తీవ్రమైన తలనొప్పి, వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో ఒక్కసారిగా తీవ్ర నిరసానికి గురికావడంతో ప్రిన్సిపాల్‌ని వెనువెంటనే అంబులెన్సులో ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో ఆయన తుది శ్వాస విడిచారు. మృతుడుకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రిన్సిపాల్ మృతిపై ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లు ఆనంద్, శ్రీనివాసరావు, కృష్ణవేణి సంతాపం వ్యక్తం చేశారు.



పాడేరులో విద్యుత్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పాడేరురూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో పాడేరు విద్యుత్ శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని విద్యుత్ శాఖ పర్యవేక్షణ ఇంజనీర్(ఎస్‌ఈ) జీఎస్.ప్రసాద్ తెలిపారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కంట్రోల్ రూమ్‌కు 94906 10026 నంబరు కేటాయించామన్నారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. తెగిపడిన విద్యుత్ వైర్లు, తడిచిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లపై పడిన చెట్టు కొమ్మలను గాని ప్రజలు నేరుగా తాకవద్దని కోరారు. ఏదైనా విద్యుత్ సమస్య వస్తే సమీపంలోని విద్యుత్ సెక్షన్ ఆఫీస్‌కు లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912కుగాని కంట్రోల్‌రూమ్ 9490610026 నంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు.

ఆదివాసీ ఉద్యోగ రిజర్వేషన్‌పై కేబినెట్‌లో చర్చించాలి

పాడేరురూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ఉద్యోగ రిజర్వేషన్ గురించి ఈనెల 16న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రామారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర కోరారు. ఈమేరకు గిరిజన సంక్షేమశాఖ మంత్రికి, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శికి, జిల్లా కలెక్టర్‌కు ఆదివాసీ గిరిజన బహిరంగ లేఖను మెయిల్ ద్వారా పంపించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మానపడాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- వాడవాడలా పల్లెపండుగ
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పాడేరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు అన్నారు. మండలంలోని కాడెలి పంచాయతీ వర్తనాపల్లి, కిండంగి, లగిశపల్లి పంచాయతీల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బొర్రా నాగరాజు మాట్లాడుతూ.. పల్లె పండుగతో గిరిజన ప్రాంతంలోని పంచాయతీలు ఎంతగానో అభివృద్ధి సాధిస్తాయన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి, టీడీపీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బుక్కా జగదీష్, జనసేన జిల్లా ఉపాధ్యక్షురాలు కిట్లంగి పద్మ, వీర మహిళ దివ్యలత, సర్పంచులు వనుగు బసవన్నదొర, లకే పార్వతమ్మ, పంచాయతీ కార్యదర్శి చిన్ని, ఈవోపీఆర్‌డీ ఆర్‌వీఎస్.రమేష్, టీడీపీ నాయకులు జె.కనకరాజు, డి.వెంకటరమణ పాల్గొన్నారు.

కొయ్యూరులో.. మారుమూల కొండలపై గల గ్రామాలను సైతం ప్రగతి పథంలో నడిపించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో మేరీరోస్ అన్నారు. సోమవారం మూలపేట పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పంచాయతీ పరిధిలోని రామాపురంలో రచ్చబండ నిర్మాణం, ఉపాధి పథకంలో ఎస్ఎంసీ ట్రెంచ్ తవ్వకాల పనులను సర్పంచ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వీఆర్వో కుమారి, సచివాలయ, సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగులలో.. మండలంలోని జి.మాడుగుల పంచాయతీ నేరోడివలస గ్రామంలో ఎంపీపీ వంతాల కల్యాణి ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి రూ.30 లక్షలతో మంజూరైన బీటీ రోడ్డుకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంతాల కొండలరావు, కె.కళ్యాణం, కె.భీంబాబు, ఎల్. రామకృష్ణ, ఎం.నారాయణరాజు, ఎస్.నాగబ్బాయి, ఎంపీడీవో తేజరత్నం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో.. వర్షపు నీటిని సంరక్షించేందుకు ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నట్టు ఉపాధి హామీ పథకం ఏపీవో కొక్కుల లక్ష్మీనారాయణమూర్తి అన్నారు. సోమవారం 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా బలపం, అన్నవరం, బెన్నవరం పంచాయతీ కేంద్రాల్లో గ్రామ సభలను ఏర్పాటు చేశారు. మూడు పంచాయతీల్లో స్థానిక సర్పంచుల చేతుల మీదుగా ఇంకుడు గుంతలు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచులు పాంగి సన్యాసిరావు, రమేష్ నాయుడు, బచ్చెల సన్యాసమ్మ, ఎంపీటీసీ సభ్యులు కొర్ర సూరిబాబు, కూటమి నాయకులు ఉగ్రంగి లక్ష్మణరావు, సీతారామ్ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధిలో.. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని స్థానిక ఎంపీడీవో వై.ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం సంకాడ పంచాయతీ అసరాడ గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీడీవో ఇంకుడు గుంతల నిర్మాణాలకు భూమి పూజ చేశారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ నాగులమ్మ పాల్గొన్నారు.

అనంతగిరి: పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషిచేస్తోందని టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి సివేరి దొన్నుదొర అన్నారు. మండలంలోని అనంతగిరి పంచాయతీ తాటిగుడలోని పల్లెపండగ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజన మారుమూల గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. పల్లె పండగా ద్వారా ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలోని ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సర్పంచ్‌లు రూతు, అప్పారావు, కూటమి నాయకులు సీహెచ్.మురళీ, పి.భీమన్న, పి.జగన్‌బాబు, పి.చిట్టిబాబు, పి.బాటీ, ఎ.జానకీ, ఎం.రంజీత్, ఎం పీడీవో కుమార్, ఈసీ పవన్, టీడబ్ల్యూ ఏఈ గణేష్, ఏపీవో సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: గారిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు అన్నారు. మండలంలోని అరకు,కురిడి, కొర్రాయి పంచాయతీ కేంద్రాల్లో పల్లె పండుగ కార్యక్రమం అట్టహసంగా జరిగింది. అభివృద్ధి పనులకు ఆయా పంచాయతీలా సర్పంచులు కొములు, శారద, లచ్చులతో పాటు ఉప ఎంపీపీ లలితతో కూటమి నాయకులు, అధికారులు భూమి పూజను నిర్వహించారు. పల్లెలు అభివృద్ధి చెందాలన్నదే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మౌలిక సౌకర్యాల కల్పనకు శ్రీకారం చుట్టిందన్నారు. గత ప్రభుత్వం పంచాయతీల నిధులను మళ్లించి గ్రామాల అభివృద్ధికి దూరంగా ఉంచిందన్నారు. 100 రోజుల్లో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయ్యేలా భాగస్వాములు కావాలని ఆయాన కోరారు ఈకార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఏపీవో సూరిబాబు, కూటమి నాయకులు స్వామి, గెన్ను, నర్సయ్య, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట అక్టోబరు, (ఆంధ్రజ్యోతి) 14: పల్లె పండగతో పంచాయతీల అభివృద్ధి సాధ్యమవుతుందని కూటమి నేత నాగేశ్వరావు తెలిపారు. సోమవారం మండలంలోని బారపల్లి పంచాయతీలో పల్లె కార్యక్రమం నిర్వహించారు. ఫారంఫండ్‌తో చెరువు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్య క్రమంలో కూటమి నేతలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పెదబయలు: గ్రామ పంచాయతీల అభివృద్ధి లక్ష్యంగా ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లెపండగ నిర్వహిస్తున్నట్టు ఏపీవో నాయుడు తెలిపారు. ముందుగా సోమవారం లక్ష్మీపేట, అడుగులపుట్టు, సీతగుంట, అరడకోట, సీకరి పంచాయితీల్లో పలు అభ్వృద్ధిపనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. మండలంలోని 23 పంచాయతీల్లో ఉపాధి పనులు చేపడతామన్నారు.



కాడెలిలో నిర్వహించిన పల్లె పండుగలో నాగరాజు తదితరులు



భూమి పూజ చేస్తున్న డుంబ్రిగుడ అధికారులు, నాయకులు



అరకు మండలం కంటబొంసుగుడ లో సీసీరోడ్డుకు భూమి పూజ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి దొన్నుదొర, సర్పంచ్ దాసుబాబు


అనకాపల్లిలో అమ్మవారి విగహాన్ని ఊరేగిస్తున్న భవానీ భక్తులు

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

» మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ దుర్గామాత విగ్రహాల నిమజ్జనం


దాడి రత్నాకర్‌ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించిన భక్తులు వీధివీధిన మండపాల్లో కొలువుదీరిన దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటు చూసినా కోలాహల వాతావరణం నెలకొంది. అనకాపల్లిలోని సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల గుండా ప్రత్యేక వాహనాలపై మేళతాళాలు, బాజాభజంత్రీలతో ఊరేగించి శారదా నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, వ్యవస్థాపకులు పీవీ రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిదానందొడ్డిలోని కామాక్షిదేవి ఆలయంలో జరిగిన శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో సోమవారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధనను నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ తొలుత అమ్మవారిని దర్శించుకుని అన్నసమారాధనను ప్రారంభించారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ కూడా దర్శించుకున్నారు.ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, కమిటీ ప్రతినిధులు ఎస్.సతీష్, డి. లక్ష్మణరావు, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కోటిపల్లి జేజిబాబు, కొమ్మోజు గోవిందరాజు, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

» ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో డీఆర్వో దయానిధి


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్వో దయానిధి

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఆర్వో దయానిధి అధికారులను ఆదేశించారు. ఇక్కడి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ఆయన పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. అందరితో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి 151 మంది వచ్చి అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఒకవేళ పరిష్కారం చూపలేకుండా అందుకు గల కారణాలను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ రమామణి, సుబ్బలక్ష్మి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరవాడ : మండల కేంద్రం పరవాడ పరిసర ప్రాంతాల్లో గల సహజ వనరులను కాలుష్యంతో నాశనం చేస్తున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో దయానిధికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పరవాడ ప్రాంతంలో గల ఊరచెరువు, పెద్ద చెరువు, సన్యాసిచెరువుతో పాటు మల్లోడిగెడ్డలోకి రాంకీ యాజమాన్యం ఇష్టానుసారంగా ఫార్మా వ్యర్థాలను విడుదల చేస్తుందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కాలుష్యాన్ని అరికట్టడానికి జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు.

'కేజీబీవీల్లో పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి'


సమావేశంలో మాట్లాడుతున్న వీరుయాదవ్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బోధనేతర విధులు నిర్వహించేందుకు ఎంఈవో కార్యాలయంలో దివ్యాంగులైన మహిళా అభ్యర్థినులు దరఖాస్తులు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ కోరారు. ఇక్కడి ఉడ్‌పేటలోని సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాన్ టీచింగ్ పోస్టులైన హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, నైట్‌వాచ్‌మెన్ ఉమెన్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు తమ తమ మండలాల్లో ఉన్న ఎంఈవో కార్యాలయాలకు దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోగా అందజేయాలన్నారు. నాన్ టీచింగ్ పోస్టులకు దివ్యాంగులైన మహిళా అభ్యర్థులకు అర్హత కల్పిస్తున్నందుకు సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ రవిప్రకాశ్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు ఉంచాలి



అనకాపల్లిలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయ జంక్షన్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గల తెలుగు విశ్వ విద్యాలయాలకు ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ గత నెల 20వ తేదీన తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశం నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్ 1985లో ఉభయ రాష్ట్రాల హైద్రాబాద్, రాజమండ్రి, శ్రీశైలం, కూచిపూడి ప్రాంతాల్లో ఉన్న తెలుగు విశ్వ విద్యాలయాలను నెలకొల్పి వాటికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆ పేరును తొలగించేందుకు నిర్ణయించడం సరికాదన్నారు. అమరజీవి పేరును కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, మల్లేశ్వరరావు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే దక్కిన 19 మద్యం షాపులు

» సబ్బవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ అనిల్‌కుమార్

సబ్బవరం, అక్టోబరు 14 (ఆంధ్యజ్యోతి) : ప్రైవేటు మద్యం షాపులు ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్నాయని సబ్బవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ డి.అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ షాపుల వేలం ప్రక్రియలో సబ్బవరంలో ఎనిమిది మద్యం షాపులు, పరవాడలో పదకొండు మద్యం షాపులను స్థానికులే దక్కించుకున్నారన్నారు. ప్రభుత్వానికి వీరు చెల్లించాల్సిన మొత్తం అమౌంట్‌లో ఆరో వంతు చెల్లించినందున తాత్కాలిక లైసెన్స్‌లు మంజూరు చేయడం జరిగిందన్నారు. దీంతో సదరు యజమానులు ఈనెల పదహారో తేదీ నుంచి షాపులు తెరుస్తారన్నారు. అన్ని రకాల డాక్యుమెంట్లు ప్రభుత్వానికి సమర్పించిన వారికి పదిహేను రోజులు తరువాత పర్మినెంట్ లైసెన్స్ మంజూరు చేస్తామని ఆయన వివరించారు.

ఐదేళ్లలో రాష్ట్రం అన్నింటా అభివృద్ధి

» వైసీపీ హయాంలో దోచుకోవడానికే తొలి ప్రాధాన్యం » కూటమి పాలనలో అభివృద్ధే లక్ష్యంగా అడుగులు

» పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల ప్రారంభోత్సవంలో ఎంపీ సీఎం రమేష్


కశింకోటలో పల్లె పండుగలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేష్

కశింకోట, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల కూటమి పాలనలో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతామని అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్ స్పష్టం చేశారు. సోమవారం కశింకోటలోని అగ్రహారం వీధిలో జరిగిన పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కశింకోటను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మొదటి ప్రాధాన్యం జగన్‌మోహన్‌రెడ్డి దోచుకోవడానికే ఇచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో పంచాయతీల అభివృద్ధికి సంబంధించిన రూ.మూడు వేల కోట్లు నిధులు దారి మళ్లించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 20 వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం అగ్రహారం వీధిలో రూ.2.24 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.3.88 లక్షలు విలువ చేసే పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించినట్టు చెప్పారు. గ్రామంలో సురక్షిత మంచినీటి ప్లాంట్లకు అవసరమైనంత మేరకు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కళ్యాణ మండపం కూడా లేదని గ్రామస్థులు వినతిపత్రం ఇవ్వడంతో వాటి నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అవసరమైతే సీఎస్ఆర్ నిధులు కూడా మంజూరు చేయించి నిర్మాణం చేస్తామన్నారు. ముందుగా సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, సర్పంచ్ జయరంజిని, డ్వామా పీడీ పూర్ణిమదేవి, మండల ప్రత్యేకాధికారి రోజారాణి, ఎంపీడీవో రవికుమార్, తహశీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఏపీడీ మణికుమార్, కూటమి నేతలు పాల్గొన్నారు. అదే విధంగా వెదురుపర్తి, బయ్యవరం, విస్సన్నపేట గ్రామాల్లో పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు జరిగాయి.

రూ. కోటి 72 లక్షలతో డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తూరు : అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ రామాపురం, దేవీనగర్.., సత్యనారాయణపురం పంచాయతీ సత్యనారాయణపురం, మూలపేట.., పిసినికాడ పంచాయతీ సాయినగర్ గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి మండలంలోని పలు పంచాయతీల్లో రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టి గ్రామాలను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఇందులో భాగంగా కొత్తూరు పంచాయతీ రామాపురంలో రూ.62 లక్షలతో కాలువలు, దేవీనగర్‌లో రూ.25లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, ఎస్సీ కాలనీలో రూ.ఐదు లక్షలతో రోడ్డు నిర్మించనున్నామని వివరించారు. అంతేకాకుండా సత్యనారాయణపురం పంచాయతీలో రూ.30లక్షలతో, మూలపేటలో రూ.30లక్షలతో సీసీ రోడ్లు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. పిసినికాడ పంచాయతీ సాయినగర్‌లో రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. కాగా సత్యనారాయణపురంలో జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పలకా భాగ్యలక్ష్మి, సప్పారపు ప్రసన్నలక్ష్మి, కూటమి నేతలు చదరం నాగేశ్వరరావు, కోన శ్రీను, మళ్ల శ్రీను, మేడిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్బవరంలో ఎమ్మెల్యే పర్యటన

సబ్బవరం : పల్లె పండుగలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సబ్బవరంలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఉదయం పది గంటలకు ఆరిపాకలో జరనున్న ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. అనంతరం గొటివాడ, టెక్కలిపాలెం, వంగలి, అంతకాపల్లి, గాలిభీమవరం, నారపాడు గ్రామాల్లో జరగనున్న ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని వివరించారు.


అగ్రహారం వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీ సీఎం రమేష్ శంకుస్థాపన


కొత్తూరు పంచాయతీ రామాపురంలో...

సచివాలయాల హెల్త్ సెక్రటరీలు ఆందోళన

» వైద్య ఆరోగ్యశాఖలోకి తీసుకురావాలని నినాదాలు


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న హెల్త్ సెక్రటరీలు

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలను పూర్తిస్థాయిలో వైద్య ఆరోగ్యశాఖలోకి తీసుకురావాలంటూ సోమవారం వారంతా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ, వార్డు సెక్రటరీల సంఘం జిల్లా కార్యదర్శి ఆళ్ల దేవకి మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీలు మునిసిపల్ కమిషనర్, ఎంపీడీవో, డీఎం హెచ్‌ఓ పరిధిలో పనిచేయడం వల్ల ఒకే సమయంలో వేర్వేరు పనులు తమకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. దీంతో గత మూడు సంవత్సరాలుగా తీవ్ర మానసిక ఒత్తిడిని అనుభవించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. దీనిని సరిచేయాలని, వివిధ శాఖల మధ్య సమన్వయం జరిగేలా ఆదేశాలు జారీ చేయాలని, మొత్తం సిబ్బందిని వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోకి తీసుకురావాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం స్పందించ లేదని ఆమె ఆరోపించారు. హెల్త్ సెక్రటరీలను పూర్తిస్థాయిలో డీడీవో అధికారాలతో సహా వైద్య ఆరోగ్యశాఖకు బదలాయించాలని, సీనియార్టీ లిస్టులను తయారుచేసి ఎంపీహెచ్‌ఏ (ఎఫ్) లుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు ఆందోళన

కశింకోట, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : బయ్యవరం వద్ద ఉన్న సాగర్ సిమెంటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు వి.గోవింద, ఎన్.మణిబాబు, ఎం.సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. 16 టైర్ల వెహికల్ డ్రైవర్లకు రూ.650, 14 టైర్ల వాహనాల డ్రైవర్లకు రూ.600లు చొప్పున 24 గంటలు పనిచేస్తేనే ఇస్తున్నారన్నారు. అంతేకాకుండా ప్రమాదంలో రెండు కాళ్లు పోయిన డ్రైవర్‌కు ఇప్పటి వరకు ఎటువంటి ఆర్థిక సహాయం చేయకపోవడం తగదన్నారు. వీటన్నింటిపై ఫ్యాక్టరీ అధినేత శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందించి యాజమాన్యంతో ప్రస్తావించి మంగళవారం సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకర్, ట్రాన్స్‌పోర్టు కార్మికులు పాల్గొన్నారు.


ఫ్యాక్టరీ ఎదుట నిరసన తెలియజేస్తున్న ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు

జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో చెత్త సమస్య

» వీధుల వెంబడి పేరుకుపోతున్న కుప్పలు
» పట్టించుకోని పంచాయతీ సిబ్బంది
» ఈగలు, దోమల బెడదతో కాలనీవాసులకు ఇబ్బందులు


జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలోని ప్రధాన రహదారుల వెంబడి దర్శనమిస్తున్న చెత్తకుప్పలు



పరవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో పారిశుధ్యం క్షీణించింది. ప్రధాన రహదారుల వెంబడి చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. వాడి పారేసిన పాలిథిన్ కవర్లు కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయి. రోజుల తరబడి ఇవి పేరుకుపోవడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. ఈ కారణంగా దోమలు, ఈగల బెడద అధికమై ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. చెత్తను వీధి కుక్కలు చిందరవందర చేస్తుండడంతో వాతావరణం మరింత పాడవుతోందని అంటున్నారు. చెత్తను తరలించడంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రోజుల తరబడి చెత్త ఉండడంతో కుళ్లి భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని, అంటువ్యాధులు భయం వెంటాడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి చెత్త తరలింపునకు చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లఆందోళన


నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

సబ్బవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంట్రాక్టు లెక్చరర్లు సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పసుపు రిబ్బన్లు ధరించి సమస్యలపై నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం జీవో నంబరు 114 ప్రకారం కాంట్రాక్టు లక్చరర్లను రెగ్యులర్ చేస్తామని చెప్పి కాలయాపన చేసిందన్నారు. కూటమి ప్రభుత్వమైనా తమగోడు పట్టించుకొని తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

సబ్బవరం తహసీల్దార్‌గా చిన్నికృష్ణ

సబ్బవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సబ్బవరం తహసీల్దార్‌గా బమిడి చిన్నికృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి జిల్లా కలెక్టరేట్‌లో పరిపాలనాధికారిగా ఉన్న ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ శాఖ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అంతకుముందు సిబ్బంది పుష్ప గుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.

దళితుల భూములు అప్పగించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిని అందజేస్తున్నదృశ్యం

సబ్బవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బంగారమ్మపాలెంలో దళితలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని తిరిగి పేదలైన దళితలకు అప్ప గించాలని పలువురు కోరారు. ఈ మేరకు సీపీఎం మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలువురు దళితులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వంగర అర్జున, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా రేపు

చోడవరం, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 16 బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ పి. కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. స్కిల్‌హబ్ ద్వారా నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన 10వ తరగతి నుంచి డిగ్రీ ఆపై విద్యార్హత కలిగిన అభ్యర్థులు పాల్గొనవచ్చని సూచించారు. ప్రముఖ కంపెనీలు వరుణ్‌మోటార్స్, అపోలో, హెల్త్‌కేర్ సంస్థలు పాల్గొంటున్నాయన్నారు.

బాణసంచా స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా

గొలుగొండ, అక్టోబరు 14:(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటిగైరంపేట గ్రామంలో ఒ వ్యాపారి వద్ద దాడులు నిర్వహించి బాణ సంచా స్వాధీనం చేసుకున్నట్టు నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. ముందస్తు సమాచారంతో దాడి చేసి కేతవరపు జగదీష్ వద్ద విలువ సుమారు రూ. లక్ష విలువైన బాణ సంచా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయనపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. అనుమతులు లేకుండా దీపావళి, నాగుల చవితి పండగలకు మందుగుండు సామగ్రి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు

చీడికాడ, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికిగాను రూ.ఐదు కోట్ల తొమ్మిది లక్షల 90వేలు నిధులు మంజూరైనట్టు ఎంపీడీవో హేమసుందరరావు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, జి.కొత్తపల్లి, పెదగోగాడ, చెట్టుపల్లి, బైలపూడి, ఖండివరం, తురువోలు, దండిసురవరం, మంచాల, కోనాం, ఎల్‌బి.పట్నంలలో ఈ పనులు చేపట్టనున్నామన్నారు.